క్లుప్తంగా

ఉయ్యూరు బస్టాండులో చలివేంద్రం ప్రారంభం



ఉయ్యూరు: వేసవిలో దాహార్తిని తీర్చటాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఆదాయపు పన్ను కమిషనర్ దిరిశం సుధాకర్ తన తల్లిదండ్రులు ప్రభాకర్‌రావు, సరోజిని జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన చలివేంద్రంను చైర్మన్ నాని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దిరిశం జ్యోతిర్మయి, ఎంజే రవి, పినమాల నాగకుమార్, దిరిశం ప్రేమాకర్, కొక్కిలిగడ్డ ప్రదీప్, డాలీ పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ' పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గన్నవరం: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, సహాయకుల పోస్టులను రోస్టర్ పాయింట్ ఆధారంగా భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో పి. వెంకటలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉంగుటూరు మండలంలోని లంకపల్లి మినీ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త(ఓసీ), సహాయకుల పోస్టులకు వీరపనేనిగూడెం-1(బీసీ-బీ), ఎలుకపాడు(ఓసీ), తిప్పనగుంట-1(ఓసీ), రేమల్లే-4(ఎస్టీ) పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 2022 జూలై 7వ తేదీకి 21 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగి పదో తరగతి చదివిన స్థానికులైన వివాహిత మహిళలు మే ఒకటో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుతోపాటు విద్యార్హత, వయసు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్‌లను జతపరచాలని సూచించారు.

సహస్ర చండీ యాగానికి అందరూ ఆహ్వానితులే

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): 27వ తేదీ నుంచి మే 3వ వరకు నైనవరం ఫ్లైఓవర్ సమీపంలో నిర్వహిస్తున్న సహస్ర చండీ యాగ పూర్వక కుంభాభిషేకానికి ప్రతి ఒక్కరూ ఆహ్వానితులేనని ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పి.గౌతమ్‌రెడ్డి, గజల్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఫ్లైఓవర్ దిగువన నిర్మించిన యాగశాల వద్ద 72 అడుగుల అష్టభుజ మహా చండీ విగ్రహ నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. అమ్మవారి విగ్రహ నిర్మాణ పనులను గజల్ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనివాసరావు, పీఠాధిపతి కరుమారి దాసు, లఖంరాజు సునీత పరిశీలించారు. కరుమారి అమ్మన్ శక్తిపీఠం వద్ద నిర్వహిస్తున్న సహస్ర చండీ యాగానికి ప్రతి ఒక్కరూ విచ్చేసి యాగాన్ని వీక్షించవచ్చన్నారు. యాగానికి పలువురు మంత్రులతో పాటు ఆధ్యాత్మిక వేత్తలు, పీఠాధిపతులు విచ్చేయనున్నారని పేర్కొన్నారు. పీఠం కోశాధికారి జ్ఞానేశ్వర్, సత్య శ్రీహరి, శంకరరెడ్డి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

నేడు దుర్గమ్మ సన్నిధిలో మహాలక్ష్మి యాగం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అక్షయ తృతీయను పురస్కరించుకుని ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మహాలక్ష్మీ యాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద యాగశాలలో ఉదయం 9 గంటలకు యాగం ప్రారంభమవుతుందన్నారు. రూ.వెయ్యి టికెటు కొనుగోలు చేసిన భక్తులు ఈ యాగంలో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. యాగం అనంతరం ఉభయదాతలకు శేషవస్త్రం, రవిక, పెద్ద లడ్డూ, చక్రపొంగలి, పులిహోర ప్రసాదాలు అందిస్తామని తెలిపారు.

అంబేడ్కర్ స్మృతివనం పనులు పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ స్వరాజ్య మైదానంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ నిర్మాణ పనులను విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులను ఆదేశించారు. అన్ని భాగాలు కలిపి చాలా జాగ్రత్తగా విగ్రహ నిర్మాణం చేయాలని సూచించారు. ఇది అద్భుతమైన ప్రాజెక్ట్‌ని, ఎక్కడా పొరపాట్లు లేకుండా చూడాలని అన్నారు. నిర్ణీత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు కార్మికులను నియమించుకోవాలని సూచించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఏపీఐఐసీ, కేసీపీ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్



యనమలకుదురు ఈద్గాలో రంజాన్ పండుగ సందర్భంగా ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు, సందేశమిస్తున్న మత పెద్ద



కానూరు సనత్‌నగర్‌లో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పార్థసారథి



కానూరు పంట కాలువ వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు



ఉయ్యూరులో రంజాన్ ప్రార్థనల్లో ముస్లింలు

పెనమలూరు: మండల పరిధిలో శనివారం రంజాన్ పండుగను ముస్లింలు పవిత్రంగా జరుపుకొన్నారు. అన్ని మసీదులు, ఈద్గాలు ముస్లిం భక్తులతో కిక్కిరిసిపోయాయి. గత నెలరోజులుగా కఠినమైన ఉపవాసాలు పాటించి నెలవంక కనిపించిన తరువాత ఉపవాసాలు విరమణ చేసి భక్తి శ్రద్ధలతో రంజాన్ పండుగ చేశారు. కానూరు సనత్‌నగర్ ఈద్గా వద్ద ఈదుల్ ఫితర్ నమాజ్ చేశారు. ముస్లిం మత పెద్ద ముష్తి బయాస్ ప్రసంగం ద్వారా అల్లహ్ విశిష్టతను, ఖురాన్ సూక్తులను తెలుపుతూ సర్వమత సమ్మేళనం శాంతి సందేశం ఇచ్చారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు పరస్పరం అభివాదం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మస్జిద్ ముబారక్ ఆధ్వర్యంలో కానూరు టీచర్స్ కాలనీలో ఉన్న గ్రౌండ్‌లో నమాజ్ చేశారు.పెద్దలు, చిన్నారులు నమాజులో పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

యనమలకుదురులో...

యనమలకుదురు ఈద్గాలో ఈదుల్ ఫితర్ నమాజ్ ఆచరించటానికి వచ్చిన ముస్లింలతో ఈద్గా ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. జన్నతుల్ బఖి ఖబరస్తాన్, ఈద్గా కమిటీ భక్తులకు పూర్తి సౌకర్యాలు కల్పించారు. రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో చేసుకున్నారు. మండల పరిధిలో గంగూరు, గోసాల, పెనమలూరు, పలు గ్రామాల్లో రంజాన్ పండుగ వేడుకలు చేశారు.

కంకిపాడులో...

కంకిపాడు: రంజాన్ పర్వదినాన్ని శనివారం ముస్లింలు భక్తిప్రపత్తులతో జరుపుకొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా కంకిపాడు, ఈడుపుగల్లు ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్రార్థనా ప్రాంగణాల్లో ముస్లింలు భారీ సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు పండుగ విశిష్టతను తెలిపి ప్రార్థనలు చేయించారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు హత్తుకుని పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. దానధర్మాలు ఆచరించారు.

ఉయ్యూరులో...

ఉయ్యూరు: రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని పలు మసీదుల్లో శనివారం ఉదయం అల్లాను స్మరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గా మైదానానికి వెళ్లి ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మండలంలోని పెద ఓగిరాల మసీదులో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురంలోని ఈద్గాలో గన్నవరం మసీదు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు, అంజుమాన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. దావాజీగూడెంలోని పామర్తినగర్‌లో ఉన్న ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలుత ముస్లింలు ప్రదర్శనగా ఈద్గా వద్దకు తరలివెళ్లారు. అనంతరం పేదలకు ధనధర్మాలు చేశారు.

రామవరప్పాడు: రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లోని మసీదుల్లో ఉదయం నుంచి ముస్లిం సోదరులు పార్థనలు చేశారు. ఎనికేపాడులో మహమ్మదీయ, నిడమానూరులో మినార్ మసీదులో ముస్లిం మత పెద్దలు ఖురాన్‌లోని సూక్తులు బోధించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని జమాతే ఇస్లామీ హింద్, ఏలూరురోడ్డు మసీదు, మహాత్మాగాంధీ నగర్, వేలేరు, కొత్తపల్లి, కొత్త మల్లవల్లి, శోభనాద్రిపురం గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలుచోట్ల హిందు, ముస్లింలు ఆలింగనం చేసుకుని పరస్పరం ఈద్ ముబాకర్ తెలిపారు.

గన్నవరం రూరల్: ముస్తాబాద ఈద్గా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. జామియా మసీద్ ఇమాం హసీన్ ఇక్బాల్.. ప్రపంచం శాంతి, కరుణలతో వర్ధిల్లాలని అల్లా సందేశమిచ్చారని చెప్పారు. ముస్తాబాద, సూరంపల్లి, పురుషోత్తపట్నం తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పార్థసారథి

పవిత్ర రంజాన్ పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కానూరు సనత్‌నగర్‌లో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చాన్‌బాషా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రంజాన్ వేడుకల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి సామరస్యానికి రంజాన్ పండుగ ప్రతీక అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పఠాన్ అహ్మద్, జాఫర్‌ఖాన్, అజీజుల్లా, సైదుఅహ్మద్ పాల్గొన్నారు.

గోపిశెట్టి కుటుంబానికి పరామర్శ



గన్నవరం: పితృవియోగం చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గోపిశెట్టి వీరాస్వామిని శనివారం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పరామర్శించారు. వీరాస్వామి తండ్రి గోపిశెట్టి వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో స్థానిక బుద్దవరం రోడ్డులోని నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం నియోజకవర్గంలో జరుగుతున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై పార్టీ నాయకులతో ఆయన చర్చించారు. తర్వాత ఇటీవల మృతి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు మండవ వెంకటేశ్వరరావు, పుర ప్రముఖులు నెక్కలపూడి సుబ్రమణ్యం కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే సంతాపం తెలియజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసాని, మాజీ వైస్ ఎంపీపీ గొంది పరందామయ్య, గోపవరపుగూడెం సర్పంచి నల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోసాల వృద్ధుల ఆశ్రమంలో సేవలు

పెనమలూరు: గోసాల గ్రామంలో కోనేరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధుల ఆశ్రమంలో శనివారం 500 లీటర్ల సోలార్ వాటర్ హీటర్‌ను ట్రస్టు అధ్యక్షుడు కోనేరు నరేంద్రబాబు ప్రారంభించినట్లు ట్రస్టు కార్యదర్శి కోనేరు భీమేశ్వరరావు తెలిపారు. దీంతో వృద్ధుల అవసరాలకు 24 గంటలూ వేడి నీరు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రముఖ వైద్యుడు గన్ని భాస్కరరావు, గన్ని సుబ్బలక్ష్మి ట్రస్టు నుంచి టూత్ పేస్టులు అందజేశారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కోనేరు కోటేశ్వరరావు, కంచర్ల రాధిక, కృష్ణప్రసాద్, నాగేశ్వరరావు, విజయకుమారి పాల్గొన్నారు.

ప్రగతి రథసారథి జగన్‌మోహన్‌రెడ్డి



రామచంద్రాపురంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

గన్నవరం రూరల్: రాష్ట్ర ప్రగతి రథసారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి అన్నారు. మండలంలోని సూరంపల్లిలో శనివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రచారం నిర్వహించి సంక్షేమ పథకాల కొనసాగింపునకు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ పులపాక బాబూరావు, సహకార బ్యాంకు అధ్యక్షుడు తుల్లిమిల్లి ఏడుకొండలు, తుల్లిమిల్లి ఏడుకొండలు, ఎంపీటీసీ సభ్యులు కొండాసీతారామయ్య, రామచంద్రాపురం కన్వీనర్ సర్నాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సీఎం జగన్‌పై విశ్వాసం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో పాటుగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి గ్రామంలోని బీసీ కాలనీలో ఇంటింటికి వెళ్లి నేరుగా ప్రజలను కలిశారు. గత టీడీపీ ప్రభుత్వ హాయంలో చంద్రబాబు నాయుడి పాలనకు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు తేడాను వ్యత్యాసాన్ని ప్రజలకు సవివరంగా తెలియజేశారు. ప్రజల అనుమతితో ఇంటికి జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లను అంటించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు వేముల శ్రీను, పార్టీ నాయకులు పంతం యోహాను పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు

కంకిపాడు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. మండలంలోని చలివేంద్రపాలెం, గొడవర్రులో శనివారం జరిగిన ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు పరిశీలించారు. కుందేరు గ్రామంలో సర్పంచ్ కలకోట రాధిక, నాయకులు తాతినేని పండు, టి.ఆదినారాయణ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలన గురించి వివరించి అభిప్రాయాలను సేకరించారు. మంతెనలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పటాకుల శ్రీనివాసరావు, ఎంపీటీసీ బండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు సమ న్యాయం

పోరంకిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్థసారథి



పోరంకి నారాయణపురం కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: జగనన్న పాలనలో అన్ని వర్గాల వారికి సమ న్యాయం కలుగుతుందని, ఆయన పాలన రాష్ట్ర ప్రజలకు చాలా అవసరమని, ప్రజలంతా ఆనందంగా ఉన్నారని లబ్ధిదారుడు వాసుదేవరావుతో పాటు పలువురు లబ్ధిదారులు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పోరంకి నారాయణపురం కాలనీలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అమలు చేసిన బుక్‌లెట్ అందచేసి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. జగన్ పాలనలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు న్యాయం జరుగుతుందని వివరించారు. వైఎస్సార్ పింఛన్ కానుక ప్రతి నెలా 1వ తేదీన వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ సొమ్ము ఇస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ, అమ్మ ఒడి, ఆసరా, రైతుభరోసా, సున్నావడ్డీ ఇలా అనేక పథకాలు నేరుగా అమలు చేయటం వలన మేలు జరుగుతుందని ఆనందం వ్యక్తం చేశారు. కాలనీలో తాగునీటి సమస్య ఉందని, పలు అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్మాణం చేయాలని కోరారు.

అందరూ సమానమే..

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేస్తోందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. విద్య, వైద్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు.పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందించటం వలన నేడు పేదలు అభివృద్ధి చెందుతున్నారని అన్నారు. పోరంకిలో పలు కాలనీల్లో ఉన్న సమస్యలు తన దృష్టికి వచ్చాయని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, వైఎస్సార్ సీపీ నేతలు నల్లమోతు జీవన్, అద్దేపల్లి చందు, బందెల రాజు, పి.రవి, నెర్సు సతీష్, బొర్రా వెంకట రమణయ్య, అంకెం రాజేష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

చురుగ్గా అభివృద్ధి పనులు

- నిడమానూరులో సుమారు రూ. 4 కోట్లతో అభివృద్ధి పనులు
- రూ.40 లక్షలతో అంతర్గత రోడ్లు
- రూ.2 కోట్లతో తాగునీటి సమస్య పరిష్కారం
- రూ .40 లక్షలతో సచివాలయం-2 పూర్తి



నిర్మాణం పూర్తయిన గ్రామ సచివాలయం



నెహ్రూనగర్‌లో సిమెంట్ రోడ్లు

రామవరప్పాడు: రూరల్ మండలం నిడమానూరులో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ప్రధాన మౌలిక వసతి అయిన అంతర్గత రోడ్లకు మహర్దశ పట్టింది. టీడీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని రహదారులు నేడు సుందరంగా మారుతున్నాయి. ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతాల్లో అంతర్గత రహదారుల నిర్మాణాలు దాదాపు పూర్తి కావచ్చాయి. పంచాయతీ నిధులు సుమారు రూ.40 లక్షలతో నెహ్రూనగర్, రామానగర్, శక్తినగర్, ప్రధాన గ్రామంలో సైడు డ్రెయిన్లతో పాటు అంతర్గత రహదారుల నిర్మాణం శరవేగంగా పూర్తయ్యాయి. వీటితో పాటు పలు అభివృద్ధి పనులు రూ.4 కోట్ల నిధుల వ్యయ అంచనాతో చురుగ్గా సాగుతున్నాయి. మండల, పంచాయతీ నిధులు రూ. 12 లక్షల అంచనాతో ఎస్సీ ఏరియాలో ప్రహరీ నిర్మించారు. అదే విధంగా నెహ్రూనగర్‌లో రూ.8 లక్షలతో ఆర్చిని పూర్తి చేశారు. రైతుల కోసం పంచాయతీ నిధులు రూ.25 లక్షల వ్యయ అంచనాతో గ్రావెల్‌తో రహదారులు అభివృద్ధి చేశారు.

తాగునీటి సమస్యలకు చెక్

తాగు నీటి సమస్యలకు కూడా మోక్షం కలిగింది. జలజీవన్‌మిషన్ ద్వారా రూ 2 కోట్లతో తాగునీటి సమస్యలు తొలగించనున్నారు. ప్రస్తుతం మోటారు బోర్లు, వాటర్ ట్యాంక్ ద్వారా గ్రామం మొత్తానికి తాగునీరు సరఫరా అవుతోంది. గ్రామానికి సురక్షిత తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో వాటర్‌పైప్‌లైన్ విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి స్థలం పరిశీలిస్తున్నారు. పోరంకి వెళ్లే రోడ్డులో నిర్మించబోయే వాటర్‌ట్యాంకుకు అనువైన స్థలాన్ని పరిశీలించి దాదాపు ఖరారు చేశారు. అతి త్వరలో ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. వీటితో పాటు పంచాయతీ నిధులు రూ.22లక్షలతో మూడు చోట్ల బోర్‌వెల్ నిర్మాణాన్ని ఇటీవల పూర్తి చేశారు.

సచివాలయాల నిర్మాణాలు పూర్తి

గ్రామంలో సచివాలయాలకు సొంత భవనాల నిర్మాణాలను ఇటీవల పూర్తి చేశారు. ఇప్పటికే ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.40లక్షలతో సచివాలయం-2 పూర్తైంది. మరో రూ.10 లక్షలతో సచివాలయం-1 విస్తరణ పనులు కూడా పూర్తి చేశారు. మరో 40 లక్షలతో సచివాలయం-3 నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రూ.38 లక్షలతో రెండు రైతు భరోసా కేంద్రాలు, రూ.35 లక్షలతో వెల్‌నెస్ సెంటర్లు -2 నిర్మాణ పనులను ప్రారంభించాల్సి ఉంది.

మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



నిడమానూరును మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నాం. గ్రామంలో మట్టి రోడ్లు కనిపించకుండా సిమెంట్ రహదారులుగా అభివృద్ధి చేస్తున్నాం. గ్రామంలోని బాపిరాజు చెరువు సుందరీకరణకు ప్రణాళికలు రూపొందించాం. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, గ్రీనరీ ఏర్పాటు చేసే ఆలోచనతో ముందుకెళ్తున్నాం.

–శీలం రంగారావు, నిడమానూరు సర్పంచ్

సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు దుస్తులు పంపిణీ



సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు

కంకిపాడు: అన్ని వర్గాల సంక్షేమం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వక్తలు అన్నారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి వితరణతో సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు కంకిపాడు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం రాత్రి దుస్తులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే పార్థసారథి పాటుపడుతున్నారన్నారు. ప్రతిపక్ష నేతలు కావాలని బురద చల్లుతున్నారని, విమర్శలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జగనన్న సచివాలయాల మండల చైర్మన్ రాచూరి చిరంజీవి, సీహెచ్‌సీ చైర్మన్ మేదండ్రావు కుటుంబరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తొడుసు శ్రీనివాసరావు, మరియబాబు, జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పుస్తక పంపిణీ ప్రారంభం

పటమట(విజయవాడతూర్పు): విజ్ఞానదాయక సమాజ ఆవిర్భావానికి ఉచిత పుస్తక పంపిణీ ద్వారా వేలాది మందికి ఏడేళ్లుగా పుస్తక జ్ఞానాన్ని పంచుతున్న ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం సేవలు అపురూపమైనవని విజయవాడ సిద్ధార్థ విద్యా సంస్థల అధ్యక్షుడు డాక్టర్ సి. నాగేశ్వరరావు అన్నారు. పుస్తక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యాన శనివారం పటమట శ్రీ సర్వోత్తమ భవనంలో నిర్వహించిన ఉచిత పుస్తక పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద మాట్లాడుతూ ఏడేళ్లుగా ఈ పుస్తక ప్రదర్శన ద్వారా 2 లక్షలకు పైగా పుస్తకాలు ఉచితంగా అందించామని పేర్కొన్నారు. దాతలు తమకు ఇచ్చిన పుస్తకాలను అందరికీ అందించడం పుస్తక దాత, పుస్తక స్వీకర్త కూడా సంతోషిస్తున్నారన్నారు. ఈ ప్రదర్శన, పంపిణీలో సాధారణ గ్రంథాలతో పాటు తత్వశాస్త్రం, మతాలు, ఆధ్యాత్మిక, సాంఘిక, భాష, ఇంజినీరింగ్, వైద్య, విజ్ఞాన శాస్త్రాలు, కళలు, తెలుగు, ఆంగ్ల సాహిత్య గ్రంథాలు, చరిత్ర, బాల సాహిత్యం, వ్యక్తిత్వ వికాసం పుస్తకాలతోపాటు పదవ, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు సంబంధించి వివిధ విద్యా సంస్థల స్టడీ మెటీరియల్స్ తో కలిపి దాదాపు 50 వేలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

బాలి మృతి కళారంగానికి తీరని లోటు



బాలి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

విజయవాడ కల్చరల్: చిత్రకారుడు బాలి మృతి చిత్ర కళారంగానికి తీరనిలోటు అని పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. మల్లెతీగ సాహిత్య మాసపత్రిక, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, 64 కళలు. కామ్, ఫోర్‌మ్ ఫర్ ఆర్టిస్ట్, జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో చిత్రకారుడు బాలి సంతాప సభ బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ చిత్ర కళారంగానికి బాలి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి.ఆంజనేయులు మాట్లాడుతూ బాలి చిత్రకారునిగా కార్టూనిస్ట్‌గా ఎందరో యువకులకు స్ఫూర్తినిచ్చారన్నారు. నగరంలో ఆయనకు విడదీయలేని అనుబంధం ఉందన్నారు. సీనియర్ కార్టూనిస్ట్ ఏవీఎమ్ ఆయనతో అనుబంధం గుర్తు చేసుకున్నారు. నగరంలో ఆయనతోపాటు అనేక కార్యక్రమాలలో పాల్గొన్నానని చిత్రకళకు సంబంధించిన అనేక విషయాలను వివరించేవారని పేర్కొన్నారు. మల్లెతీగ సాహిత్య మాసపత్రిక సంపాదకుడు కలిమిశ్రీ మాట్లాడుతూ బాలి కథల సంపుటి ఆవిష్కరణ నగరంలోనే జరిగిందని చెప్పారు. కృష్ణా జిల్లా గ్రంథాలయ పరిషత్ చైర్ పర్సన్ టి.జమలపూర్ణమ్మ మాట్లాడుతూ కళాకారులు, రచయితలకు మరణం లేదని వారి చిత్రాల ద్వారా, రచనల ద్వారా ప్రజల గుండెల్లో నిలిచిపోతారన్నారు. వివిధ సంస్థల ప్రతినిధులు, గుండు నారాయణ, తోపాటు పలువురు అభిమానులు పాల్గొన్నారు. బాలి చిత్రపటానికి నివాళి సమర్పించారు. చిత్రకారుడు కళాసాగర్ నిర్వహించారు.